## క్లుప్తంగా

### నేడు మహానేత డాక్టర్ వై.ఎస్‌కు నివాళి

క్రోసూరు: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటర్‌లో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం మండలంలోని 88త్యాళ్లూరులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ, నివాళుల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు కోరారు.

**అమరావతిలో..**

మండల పరిధిలోని పెదమద్దూరులో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ నాయుడు రాంబాబు తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు ఆయన పేర్కొనారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు,అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

### ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరం

మాదల(ముప్పాళ్ల): ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరమని ప్రోగ్రాం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్ తెలిపారు. మండలంలోని మాదలలో శుక్రవారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు నేరుగా ఇంటి ముందుకు వచ్చి మెరుగైన వైద్యసేవలందించడం అభినందనీయమని తెలిపారు. అన్ని వైద్యసేవలతో పాటు అవసరమైన మందుల్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణ 144 మందికి వైద్యసేవలందించారు. బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ మస్తాన్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, డీఈవో రవితేజ, ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మిరప సాగులో జాగ్రత్తలు అవసరం

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మిరప సాగులో రైతులు యాజమాన్య పద్ధతులతో పాటుగా తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సత్తెనపల్లి ఉద్యాన శాఖాధికారి సీహెచ్.జనని తెలిపారు. మండలంలోని దమ్మాలపాడులో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిరప సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ సాగుకు ముందు పొలంలో పచ్చిరొట్ట పైరు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల వేరుకుళ్లు తెగులు నివారించుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 25 కిలోల వేపపిండి వేసుకోవాలని చెప్పారు. రైతులు సాగు చేసిన పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కళ్లం కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### శోభాయమానంగా శ్రీవారి తిరుమంజనం



సత్తెనపల్లి: నిజ శ్రావణ మాస, శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి శుక్రవారం స్నపన తిరుమంజనం శోభాయమానంగా నిర్వహించారు. ఆలయంలోని గరుడల్వార్ మూర్తికి శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ దాసన్ నక్షత్ర హారతులు, విశేష పూజలు జరిపారు. ఉంజల్స్, ఏకాంత సేవల్ని నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు గరుడ వాహనంపై రైల్వేస్టేషన్ పుర వీధులలో దర్శనమిస్తూ అభయ ప్రదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో గరుడ ముద్ద, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### నేటి నుంచి త్రిశక్తి దుర్గా పీఠం బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గా పీఠం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 2న ఉదయం 7 గంటలకు మంగళ వాయిద్యాలు, 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహం, దీక్షా చరణ, కలశ స్థాపన, 8:30 గంటలకు అఖండ దీపారాధన, 9 గంటలకు లక్ష్మీ గణపతి, ప్రసన్నాంజనేయ, మహాలక్ష్మీ సరస్వతీ సమేత దుర్గామాతకు దశవిధ అభిషేకాలు, 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. 10:30 గంటలకు అమ్మవార్లకు పసుపుకుంకుమ సమర్పణ, 11 గంటలకు లలిత సహస్రనామ పారాయణ, అమ్మవార్లకు అర్చన, హారతి మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేపట్టనున్నారు. సాయంత్రం 5:30 గంటలకు అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది. ఊరేగింపు ప్రారంభోత్సవానికి పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి హాజరుకానున్నారు. ప్రముఖ అర్చకులు కలవకొలను సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి వెలిదండ్ల హనుమంతరావు శుకవారం తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.



పట్టణంలోని 12వ వార్డులో పింఛన్ల పంపిణీ చేస్తున్న చల్లంచర్ల సాంబశివరావు లోకా మాధవ



3వ సచివాలయంలో పంపిణీ చేస్తున్న మౌలాలి, ఉల్లంఘుల ప్రసాద్



19వ వార్డులో పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు,



1వ వార్డులో పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు తదితరులు

## అట్టహాసంగా వైఎస్సార్ పింఛన్ల పంపిణీ

సత్తెనపల్లి: పట్టణం, మండలంలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ శుక్రవారం అట్టహాసంగా జరిగింది. తెల్లవారుజామునే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నగదును అందజేశారు. పట్టణంలో 6,214 మందికి గానూ రూ.1,72,96,250 పంపిణీ చేశారు. వీరితో పాటు 189 మందికి కొత్తగా పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం పింఛన్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 10,403 మందికి గానూ రూ.2,87,32,500 పంపిణీ చేశారు. వీరితో పాటు కొత్తగా 334 మందికి కొత్తగా పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవి సత్యనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

# టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 100 కుటుంబాలు

- వడ్డెర్లకు అండగా వైఎస్సార్ సీపీ
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన 100 వడ్డెర కుటుంబాలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరాయి. సత్తెనపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొండపి గ్రామానికి చెందిన వల్లెపు బ్రహ్మయ్య, ఓర్సు బాబూరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారందరినీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, ఇతర మండల నాయకులు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో 538 ఓట్లు మెజార్టీ, 2019లో 39 ఓట్ల మెజార్టీ టీడీపీకి వచ్చిందన్నారు. గ్రామంలో 450 ఓట్లు వడ్డెర్లకు ఉంటే..ఈసారి 400 పై చిలుకు వైఎస్సార్ సీపీకి పడనున్నాయని తెలిపారు. స్థానిక నాయకులతో కలసి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో తొండపి గ్రామంలో ఊహించని మెజార్టీ వైఎస్సార్ సీపీకి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీలో చేరిన వారిలో 10వ వార్డు మెంబర్ రాయుడు కోటేశ్వరరావు, ఓర్సు గురవయ్య, బండారు కోటేశ్వరరావు, వల్లెపు నాగేశ్వరరావు, వల్లెపు నాగరాజు, ఓర్సు సాంబయ్య, శివరాత్రి వెంకటేశ్వర్లు, బత్తుల అంజి, ఓర్సు శ్రీను, వల్లెపు వీరాస్వామి, బత్తుల జీవన్‌బాబు, ఓర్సు రామారావు, వల్లెపు చెన్నయ్య, వల్లెపు శ్రీను, ఓర్సు వెంకన్న, ఓర్సు వాసు, వల్లెపు వెంకటరమణ, వల్లెపు లక్ష్మయ్య, వల్లెపు వెంకటేశ్వరరావు, వల్లెపు శ్రీనివాస్, వల్లెపు వెంకటేశ్వర్లు, కొండలు, దుర్గారావు ఉన్నారు. ఈ సందర్భంగా ఓర్సు బాబూరావు మాట్లాడుతూ ఎవరి ఒత్తిళ్లతోనో తాము వైఎస్సార్ సీపీలో చేరడం లేదని, మంత్రి అంబటి రాంబాబు చేస్తున్న మంచి పనుల్ని చూసే చేరుతున్నామని చెప్పారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గతానికంటే భిన్నంగా అత్యధిక మెజార్టీ వచ్చేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ యువ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బీసీలకు, వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత, సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి అంబటి రాంబాబుకు అండగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, నాయకులు రాయపాటి పురుషోత్తమరావు, బోరుపోతు కాటయ్య, నక్క శ్రీను, ఎంజీఆర్ లింగారెడ్డి, సిరిగిరి గోపాలరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, రాయుడు చిన్నబ్బాయి, జానీబాషా, భూపతి షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకం, భరోసా జగనన్నే..

**ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**



ప్రజలకు కరపత్రాలు అందజేసి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: రాష్ట్ర ప్రజల నమ్మకం, భరోసా జగనన్నేని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని పాపాయపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి ఇంటికీ ఆయన వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. ప్రజలు పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మళ్లీ సీఎంగా జగన్ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మర్రి అచ్చిరెడ్డి, నాయకులు ఎ.వెంకట్రామిరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముస్లింలకు అండగా జగన్ సర్కారు**

అచ్చంపేట: ముస్లింలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి అండగా ఉంటారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. స్థానిక చామర్రు రోడ్డులో శుక్రవారం ఆయన నూతనంగా నిర్మించిన గౌసియా మసీదును సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో 16 షాదీఖానాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్‌ఎ స్వార్కే సాయిరెడ్డి, నాయకులు కమల్ సైదా, ఉప సర్పంచ్ జాని, బీరువాల జాని, అక్బర్, పార్టీ టౌన్ కన్వీనర్ షేక్‌సైదా, ఎంపీటీసీ సభ్యుడు గౌస్‌మొహిద్దీన్, గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి పాల్గొన్నారు.

**యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి**

పెదకూరపాడు(అమరావతి): నియోజకవర్గంలో పనిచేస్తున్న 250 మంది యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డ్వాక్రా యానిమేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు యానిమేటర్లు మాట్లాడుతూ 2021 తర్వాత గ్రామ సంఘాల్లో నియమితులైన యానిమేటర్లకు గౌరవ వేతనం అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అందరికీ హెచ్‌ఆర్ పాలసీని వర్తింప చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

**అచ్చంపేట పీహెచ్‌సీ తనిఖీ**

అచ్చంపేట: ఎమ్మెల్యే శుక్రవారం అచ్చంపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇద్దరు వైద్యులు లేకపోవడంపై ఆరా తీశారు. సిబ్బందిలో సగానికిపైగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శోభారాణితో ఫోనులో మాట్లాడారు. సిబ్బంది పనితీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని, ఇద్దరు డాక్టర్లు ఒకేసారి గైర్హాజరైతే రోగుల్ని ఎవరు చూస్తారంటూ ప్రశ్నించారు. 24/7 సేవలు అందించే సిబ్బందినే నియమించాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడి ఉన్నారు.

### వైఎస్సార్ సీపీలోకి పలువురు టీడీపీ కార్యకర్తలు

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం గుంటూరులోని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వ పనితీరుతోనే పార్టీలో చేరికలు పెరిగాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో జడల ఉదయశ్రీ, జడల ఏసమ్మ, వేమవరపు మరియమ్మ, వేమవరపు ఏసమ్మ, కంభంపాటి నాగమ్మ, పద్మ ,చిన్నమ్మాయి, మరియదాసు, వేమవరపు బాబు, ఇంద్ర, మార్లెళ్ల ఆదినారాయణ, నవ్య, వేమవరపు శిరీష, రవికిరణ్, బెజ్జంకి రాజశేఖర్, కోటశ్వరమ్మ, తదితరులున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ గ్రామ అధ్యక్షుడుఉ పల్లప్రోలు వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లాబక్షు, పెద్దబాబు, నర్రా వాసుదేవమూర్తి పాల్గొన్నారు.

## సంపూర్ణ పోషణతో ఆరోగ్యమస్తు

సత్తెనపల్లి: వైఎస్సార్ సంపూర్ణ పోషణతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ తెలిపారు. పోషణ మహోత్సవంలో భాగంగా పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని 22వ వార్డులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ కొలిమి షమ్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం పోషక విలువలతో కూడిన 10 రకాల ఆహార కిట్లు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్, శెట్టి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, ఏసీడీవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

**క్రోసూరులో..**

స్థానిక సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల్ని నిర్వహించారు. పీహెచ్‌సీ అదనపు వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి పాల్గొన్నారు. పోషకాహార ఆవశ్యకత గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణకుమారి, డాక్టర్ సిరిచందన, సూపర్‌వైజర్ వి.మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సర్వేను సమన్వయంతో చేపట్టాలి: జేసీ



ముప్పాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

ముప్పాళ్ల: భూ రీసర్వే ప్రక్రియను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రక్రియపై రెవెన్యూ, వీఆర్వోలు, సర్వే సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మూడో విడత రీసర్వే ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

**సత్తెనపల్లిలో..**

రీ సర్వే మూడో విడత ప్రారంభించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సత్తెనపల్లి మండలంలో ప్రారంభం కాబోతున్న రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వేపై ఆయన దిశా నిర్దేశం చేశారు. ఎలక్షన్ క్లెయిమ్స్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సత్తెనపల్లి ఆర్డీవో బి.ఎల్.ఎన్. రాజకుమారి, డెప్యూటీ కలెక్టర్ వసంత్ బాబు, సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్, డెప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, కార్యాలయ సిబ్బంది, మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**పెదకూరపాడులో...**

మండలంలో రీసర్వేని వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశించారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రీ సర్వే వల్ల రైతులకు కలిగే లాభాల్ని వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ క్షమారాణి, డెప్యూటీ తహసీల్దార్ నిర్మలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

క్రోసూరు: పాండిచ్చేరి నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఈబీ సీఐ వినయ్‌కుమార్, సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. క్రోసూరుకు చెందిన షేక్ మన్సూర్ నుంచి 18 ఫుల్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# బాల్య వివాహాలతో అనర్థాలు



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళా పోలీసులు

అచ్చంపేట: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు వస్తాయని, ఆరోగ్యం క్షీణిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజరు శ్రీదేవి తెలిపారు. ఆడపిల్లల్ని బాగా చదివించాలని, వారు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అచ్చంపేటలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళా పోలీసులు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కాంబాల వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడారు. మూఢ నమ్మకాల్ని విడనాడి ఆడపిల్లల్ని ఎదిగేలా చూడాలని, 18 ఏళ్లు నిండే వరకు వివాహాలు చేయవద్దని తల్లిదండ్రులకు తెలిపారు.వివక్షతను విడనాడి ఆడ పిల్లల విద్యపై దృష్టి సారించాలని సూచించారు. మహిళలు కూడా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీజర్లు, ఆయాలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

**యూనిఫాం పంపిణీ**

స్థానిక పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు ప్రభుత్వం పంపిన రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సమానమనే ఆలోచనతో ప్రభుత్వం అందరికీ సమ దుస్తుల్ని ఇస్తున్నట్లు చెప్పారు.

# ఆలయాల్లో వైభవంగా శ్రావణ మాస పూజలు



చాగంటివారిపాలెంలోని శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముప్పాళ్ల: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చాగంటివారిపాలెంలోని శ్రీసుభద్ర బలభద్ర సహిత శ్రీజగన్నాథస్వామికి గులాబీలతో విశేష విష్ణు సహస్ర నామపూజ, గీతా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణం అనంతరం భజన నిర్వహించారు. ముప్పాళ్లలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

**సత్తెనపల్లిలో...**

శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పూజలు చేపట్టారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## వృక్షాంజనేయ స్వామికి విశేష పూజలు

నకరికల్లు: స్థానిక వృక్షాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. పూర్వాభాద్ర నక్షత్రం పురస్కరించుకొని ఆలయం వద్ద 24 గంటల ఏకాహం ప్రారంభించారు. గురువారం రాత్రంతా జాగరణ చేసి ఏకాహం నిర్వహించారు. శుక్రవారం ఏకాహం ముగిసిన సందర్భంగా ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పొంగించారు. ఆలయ అర్చకులు స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. పొంగలి పాత్రలతో మహిళలు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. యాగశాలలో నిర్వహించిన హోమాలు, పూజాదికాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద చేపట్టిన అన్నప్రసాద పంపిణీలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి

క్రోసూరు: రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న రుణమేళాను పాడి రైతులు, చేయూత లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యుడు మల్లయ్య తెలిపారు. మండలంలోని దొడ్లేరు, గరికపాడు, 88త్యాళ్లూరు గ్రామాల్లో శుక్రవారం జగనన్న పాల వెల్లువ రుణ మేళాను నిర్వహించారు. డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ పాడి రైతులు, చేయూత లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో పాడి పశువులు కొనుగోలు చేసి, అమూల్ డైరీకి పాలు పోసుకుంటూ అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. జీడీసీసీ బ్యాంకు తక్కువ వడ్డీకే రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు.ఏపీడీ శ్రీనివాసరావు, డీపీఎం హనుమాన్‌నాయక్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, ఏపీఎం సలీం పాల్గొన్నారు.

## గణపవరం జెడ్పీ హైస్కూలులో 'స్వచ్ఛతా పక్వాడ్' ప్రారంభం

రాజుపాలెం: మండలంలోని గణపవరం జెడ్పీ హైస్కూలులో శుక్రవారం 'స్వచ్ఛతా పక్వాడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుగుణమణి మాట్లాడుతూ పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 2న పిల్లలకు పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం, మాస్కుల వినియోగం, సామాజిక దూరం పాటించడంపై, 4న మరుగుదొడ్ల వినియోగం, మంచినీరు పొదుపుగా వాడకం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. 6న ప్లాస్టిక్ నిషేధం, మరుగుదొడ్ల నిర్వాహణ, 7న పరిశుభ్రతపై చిత్రలేఖనం, క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 9న భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రత, దివ్యాంగుల విద్యార్థులతో మెలిగే విధానం, 11న విద్యార్థులు చేతిగోళ్లు కత్తిరించుకోవడం, పరిశుభ్రమైన దుస్తులు, పాదరక్షలు ధరించడంపై ఉపాధ్యాయులతో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. 12న ఫొటోలు, వీడియోలు, పోస్టర్లు, పెయింటింగ్‌లు, స్వచ్ఛత ఛాయాచిత్రాల్ని ప్రదర్శించడం, 13న స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంపై ప్రజల నుంచి సలహాలు స్వీకరించడం, 15న నిర్దేశించిన కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, ప్రశంసా పత్రాలు అందజేస్తామని హెచ్‌ఎం వివరించారు.